సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 15 । జూలై । 2025


సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు 8లో


కేజీహెచ్‌లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స 8లో


ఎంఆర్‌ఐతో మరింత భద్రత 8లో

న్యూస్‌రీల్

వెస్ట్ ట్రాఫిక్ సీఐ సరెండర్



విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వెస్ట్ సబ్ డివిజన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు సరెండర్ వ్యవహారం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకపోవడం, ఆరోపణల కారణంగా ఆయన్ని రేంజ్‌కు పంపించినట్లు చర్చ జరుగుతోంది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సీఐ శ్రీనివాసరావును రేంజ్‌కు సరెండర్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో సీఎంఎస్ అండ్ సోషల్ మీడియా సెల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కోటా సురేష్‌ను నియమించారు. అతడి స్థానంలో వీఆర్-1లో ఉన్న సిహెచ్.ఉమాకాంత్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

ఎంబీఏ, ఎంసీఏ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు దరఖాస్తులు



మద్దిలపాలెం: ఏయూలో ఎంబీఏ, ఎంసీఏ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ డి.ఎ.నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాలలో ఎంబీఏ మార్కెటింగ్‌లో 40 సీట్లు, ఫైనాన్స్-40, ఎంబీఏ హెచ్‌ఆర్‌ఎం 40 ఖాళీలున్నాయి. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ఎంబీఏ 120 సీట్లు, ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసీఏ 90 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంబీఏ కోర్సు ఫీజు ఏడాదికి రూ.1.50 లక్షలు, ఎంసీఏకు రూ.1.25 లక్షలుగా తెలిపారు. ఏపీఐసెట్ 2025లో ర్యాంకు తర్వాత మిగిలిన సీట్లు మెరిట్ ప్రతిపాదికన భర్తీ చేస్తామన్నారు. దీని నోటిఫికేషన్ 15(మంగళవారం) వెలువడుతుందని, 25లోగా దరఖాస్తులు అందించాలన్నారు. కౌన్సెలింగ్ 28న ఉదయం 10 నుంచి ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు http://audoa.andhrauniversity.edu.in వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు



తాటిచెట్లపాలెం : కేకే లైన్‌లో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే కిరండూల్ రైళ్లు ఆయా తేదీల్లో కోరాపుట్ వరకే నడుస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 15వ తేదీన విశాఖపట్నం-కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 15, 16వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(18516)నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. అలాగే ఈ నెల 15, 16వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 15, 16వ తేదీల్లో కిరండూల్- విశాఖపట్నం (58502) పాసింజర్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

సబ్బవరం: విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 16న తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయాధికారి ఎస్.రామకృష్ణ తెలిపారు. బాలురకు ఉదయం 9 గంటల నుంచి, బాలికలకు మధ్యాహ్నం 1 గంట నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. దేవరాపల్లి, గొలుగొండ, సబ్బవరం, శ్రీకృష్ణాపురంలోని బాలుర గురుకులాలు, మేహాద్రిగెడ్డ, సీహోఈ, నక్కపల్లి, కోనాం, నర్సీపట్నం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి బాలికల గురుకులాల్లో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

రేపటి నుంచి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

మహారాణిపేట: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం 7.30 గంటలకు నగరానికి చేరుకొని హెచ్‌పీసీఎల్ అతిథి గృహంలో రాత్రి బస చేస్తారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు బీహెచ్‌ఈఎల్ ప్లాంటను సందర్శించి అక్కడి అధికారులతో సమావేశమవుతారు. ఆ రోజు సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమావేశమవుతారు. 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ప్లాంట్‌ను సందర్శించి అధికారులతో సమావేశమవుతారు. సాయంత్రం 3 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్, సీపీలతో కలిసి సమావేశమవుతారు.

కూటమిలో కోడి కుంపటి



- ఫ్లోర్ లీడర్ ఇవ్వకుండా తెరవెనుక కుట్రలంటూ కార్పొరేటర్ గంధం మండిపాటు
- కోడి వ్యర్థాల తరలింపులో బెదిరించి మరీ పేర్లు ప్రస్తావించారంటూ ఆగ్రహం
- సొంత పార్టీ నేతలే కారణమంటూ ఫైర్
- మేయర్ వ్యవహారంపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న కార్పొరేటర్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కోడి వ్యర్థాల అక్రమ రవాణా వ్యవహారం కూటమి నేతల్లో చిచ్చురేపుతోంది. మేయర్ పీఠాన్ని అధిష్టించి మూడు నెలలు కాకముందే ఏకంగా మంట పుట్టిస్తోంది. కుట్రలకు తెరతీస్తూ కొత్త చర్చకు దారితీస్తోంది. ఒకవైపు జనసేన ఎమ్మెల్యే, మరోవైపు టీడీపీ మాజీ ఎమ్మెల్యేతో పాటు జోన్‌కు ఒక కార్పొరేటర్ కీలకంగా వ్యవహరిస్తూ కొన్నాళ్లుగా కోడి వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్నారు. వారిలో సఖ్యత కుదరక రోజుకు ఒక వాహనాన్ని పోటీపడీ మరీ పట్టిస్తున్నారు. తాజాగా అనకాపల్లి వద్ద కోడి వ్యర్థాలను తరలిస్తున్న లారీలను అధికారులు పట్టుకోగా.. వాహన డ్రైవర్ కాస్తా గంధం శ్రీనుతో పాటు జీవీఎంసీ అధికారి పేరును ప్రస్తావించడంతో వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు ఫ్లోర్ లీడర్ పోస్టు రాకూడదనే సొంత పార్టీ నేతలే ఈ విధంగా తనను భ్రష్టుపట్టిస్తున్నారంటూ టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీను వాపోతుండటం విశేషం. డిప్యూటీ మేయర్ పోస్టు ఆశించిన గంధం శ్రీనుకు చివరి క్షణం వరకూ ఆశలు రేపి తుస్సుమనిపించారు. ఇప్పుడు జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడరు పోస్టును ఆశిస్తున్నారు. దీనిపై ఇన్ని రోజులుగా నాన్చుతూ వచ్చి.. ఇప్పుడు పూర్తిగా తప్పించేందుకే కోడి వ్యర్థాల తరలింపులో పేరు వచ్చే విధంగా చేశారని తన సన్నిహితుల వద్ద ఆయన వాపోయినట్టు సమాచారం. ఈ కుట్రలో స్వయంగా మేయర్ పాత్ర ఉందని కూడా ఆయన చెబుతున్నట్టు విశ్వసనీయవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరిపించాలని.. అసలైన కుట్రదారులెవరో బయటపడాలని కూటమి పార్టీల కార్పొరేటర్లతో పాటు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పట్టుబడుతున్నారు.

సబ్బవరం వద్ద మరో వాహనం పట్టివేత

ఈ వ్యవహారం ఒకవైపు నడుస్తుండగా తాజాగా జోన్-2 నుంచి కోడి వ్యర్థాలను తరలిస్తున్న ఏపీ39వీసీ3118 బొలెరో వాహనాన్ని సబ్బవరం వద్ద పట్టుకున్నారు. ఈ వాహనంపై ఫిర్యాదు కూడా చేసినప్పటికీ తప్పించడం గమనార్హం. జూన్ 11వ తేదీన ఇదే వాహనాన్ని కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ చిన్నవాల్తేరు వద్ద పట్టుకుని జీవీఎంసీ అధికారులకు అప్పగించారు. ఇప్పుడు అదే వాహనం మళ్లీ దర్జాగా రోడ్లపై తిరుగుతోంది.



పార్కు స్థలాల విషయంలోనూ..!

జీవీఎంసీకి చెందిన పార్కు స్థలాల వ్యవహారంలో ప్రతీ విషయంపై తనకు సమాచారం కావాలని రెండు రోజుల క్రితం టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మరీ మేయర్ ఆదేశాలు జారీచేశారు. ఇందుకు సంబంధించిన అన్ని రికార్డులూ తన ముందు ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ వివరాలన్నీ తనకు పరోక్షంగా సహకరిస్తున్న జనసేన కార్పొరేటరుకు చేరవేసి.. రచ్చ చేయడం ద్వారా దండుకోవాలని పక్కాగా ప్లానింగ్ చేస్తున్నారని కూడా సొంత పార్టీ కార్పొరేటర్లు గుసగుసలాడుకుంటున్నారు. ఈ వ్యవహారంలో మేయర్ పాత్రపై కూడా అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు కూటమి కార్పొరేటర్లు కొందరు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇప్పటికే మేయర్‌కు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి మధ్య పార్టీ సమావేశం సాక్షిగా మాటల యుద్ధం నడిచింది. మొత్తానికి కూటమి పార్టీలోని కార్పొరేటర్లు, నేతలకు.. మేయర్ వర్గానికి మధ్య మొదలైన ఈ రచ్చ కాస్తా ఏ తీరాలకు చేరుతుందనేది త్వరలో తేటతెల్లం కానుంది.

కలిసిమెలిసి.. కుట్రలకు తెరలేపి..!

వాస్తవానికి పీలా శ్రీనివాసరావుతో పాటు గంధం శ్రీను, కార్పొరేటర్ శ్రీనులు కలిసిమెలిసి ఉండేవారు. మేయర్ పీఠం అధిష్టించేవరకూ వీరితో వ్యవహారాలను నడిపించారనే విమర్శలున్నాయి. స్టాండింగ్ కమిటీ వ్యవహారాలతో పాటు ఇతర విషయాల్లోనూ వీరి ద్వారానే పనులు కానిచ్చారు. ఇప్పుడు వీరి మధ్య విభేదాలు మొదలైనట్టు సమాచారం. ఇందులో భాగంగానే డిప్యూటీ మేయర్ పోస్టు రాకుండా తనను అడ్డుకున్నారని గంధం శ్రీను అప్పట్లో వాపోయారు. ఈ వ్యవహారంలో జనసేనకు ఆ పోస్టు వచ్చేలా పట్టుబట్టేలా ఆ పార్టీ కార్పొరేటరు పీతల మూర్తి యాదవ్‌ను స్వయంగా మేయర్ ఎగదోశారని కూడా టీడీపీ కార్పొరేటర్లు మండిపడుతున్నారు. మేయర్ పీఠాన్ని ఎక్కిన తర్వాత పీలా శ్రీనివాసరావు వ్యవహారశైలి మారిపోయిందని సొంత పార్టీ నేతలే విమర్శలు గుప్పిస్తున్నారు. మొదట్లో కలిసి చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. వాహన డ్రైవర్లను బెదిరించి తనతో పాటు మరికొందరు నేతల పేర్లను బలవంతంగా చెప్పించారని గంధం శ్రీను తన సన్నిహితుల వద్ద వాపోయినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో కూటమిలోని నేతలే కీలకంగా ఉన్నారని... ఇందుకు కొద్ది మంది రౌడీషీటర్లు కూడా సహకరిస్తున్నారని ఆధారాలతో సహా సేకరించినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కూడా కూటమి నేతలే డిమాండ్ చేస్తుండటం గమనార్హం. అసలు సదరు వాహనాలు ఎవరివి? వీడియో తీసింది ఎవరు? ఎవరి ప్రోద్బలంతో వీడియోలు తీశారనే విషయాన్ని కూడా తేల్చాలని పట్టుబట్టనున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి కొద్దిరోజుల క్రితం గాజువాక ప్రాంతంలో 4,419 నెంబరు గల బొలెరో వాహనాన్ని స్వయంగా కార్పొరేటర్ గంధం శ్రీను పట్టించడంతో ఈ రచ్చ కాస్తా ప్రారంభమైనట్టు తెలుస్తోంది.

అవయవదానంతో ముగ్గురి జీవితాల్లో వెలుగులు


లోకేష్

ఆరిలోవ : తాను చనిపోయినా అవయవదానంతో ముగ్గురు వ్యక్తుల జీవితాల్లో వెలుగులు నింపి చిరంజీవిగా మారాడు ఆ యువకుడు. తన కుటుంబానికి తీరని వేదనను మిగిల్చి మరో మూడు కుటుంబాల్లో సంతోషాన్ని నింపాడు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా ఎల్.కోట సీతారాంపురానికి చెందిన టి.లోకేష్(36) ఆదివారం సాయంత్రం ఎల్.కోట వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర రక్తస్రావంతో విమ్స్‌లో చేరాడు. ఆయన్ని రక్షించేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆయన ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విమ్స్ డైరెక్టర్, జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు వారి కుటుంబ సభ్యులు, బంధువులకు అవయవదానం గురించి అవగాహన కల్పించారు. వారు అంగీకారం తెలపటంతో ఆయన అవయవాలను స్వీకరించేందుకు అనుమతులను జారీ చేశారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన కిడ్నీలు, లివర్‌ను జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం సీనియార్టీ లిస్టును అనుసరించి ఆస్పత్రులకు కేటాయించారు. ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని మృతుడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అవయవదానానికి ప్రోత్సహించిన వైద్య బృందానికి, అంగీకరించిన కుటుంబ సభ్యులకు డాక్టర్ కె.రాంబాబు అభినందనలు తెలిపారు. విమ్స్‌లో ఇప్పటివరకు ఐదు బ్రెయిన్ డెడ్ కేసుల ద్వారా అవయవాలు సేకరించి పలువురు జీవితాల్లో వెలుగులు నింపినట్లు ఆయన పేర్కొన్నారు.

23 నుంచి ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 23న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పాత ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 20వ తేదీ లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 22 మధ్యాహ్నం ఒంటి గంట లోపు సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకొని ప్రభుత్వ ఐటీఐల్లో అడిష్మన్ కోసం ఈనెల 23 నుంచి 25 వరకు, ప్రైవేటు ఐటీఐల అడ్మిషన్ల కోసం ఈనెల 26 నుంచి 27 వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

బంగాళాఖాతం నీటి తీరు బాగోదు.. అందుకే క్రూయిజ్ రాదు.!

- విశాఖ ఎంపీ భరత్ వింత వాదన
- బంగాళాఖాతంతో పోలిస్తే అరేబియా రఫ్ సీ
- క్రూయిజ్ మార్గానికి ఈ ప్రాంతం అనువైనదే..
- ఈ విషయం తెలియకుండానే అంతర్జాతీయ టెర్మినల్ నిర్మించామా.?
- విశాఖ పోర్టు వర్గాలు గుసగుసలు


మంత్రులతో ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఎంపీ భరత్

సాక్షి, విశాఖపట్నం : బంగాళాఖాతం, అరేబియా సముద్రం.. ఈ రెండింటిలో రఫ్ సీ(అలజడి) ఏదని అంటే.. అరేబియా సముద్రమేనని ఎవరైనా ఠక్కున చెప్పేస్తారు. కానీ విశాఖ ఎంపీ భరత్ మాత్రం వింత వాదన తెరపైకి తీసుకొచ్చారు. క్రూయిజ్ టెర్మినల్ దగ్గర సోమవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రులతో పాటు ఎంపీ భరత్ సమాధానాలిచ్చారు. 'రూ.100 కోట్లు వెచ్చించి క్రూయిజ్ టెర్మినల్ నిర్మించారు. కానీ దానికి రెగ్యులర్‌గా క్రూయిజ్ షిప్‌లు రావడం లేదెందుకు..?' మీడియా ప్రతినిధులు అడగ్గా.. 'బంగాళాఖాతం కాస్తా రఫ్ సీ గా ఉంటుంది. ఇక్కడ నీటి కదలికలు ఈ తరహా షిప్స్ ప్రయాణాలకు అనుకూలంగా ఉండవు. అందుకే రెగ్యులర్‌గా రావడం లేదు'.. అని ఎంపీ భరత్ సమాధామిచ్చారు. ఇది విన్న విశాఖ పోర్టు వర్గాలు ఆశ్చర్యపోయాయి. వాస్తవానికి పక్కనే ఉన్న అరేబియా సముద్రంతో పోలిస్తే.. బంగాళాఖాతం చాలా వరకూ ప్రశాంతంగా ఉంటుంది. అలాంటిది నిత్యం అలజడిగా ఉండే అరేబియా సముద్ర పరిధిలో ఉన్న ముంబై, గోవా, లక్షద్వీప్ మొదలైన ప్రాంతాలకు క్రూయిజ్ సర్వీసులు నిరంతరాయంగా తిరుగుతున్నాయి. కానీ విశాఖకు క్రూయిజ్ రాకపోవడం బంగాళాఖాతం అలజడిగా ఉండటమేనని ఎంపీ చెప్పడంపై అక్కడే ఉన్న పోర్టు వర్గాలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణానికి సముద్ర నీటి అలల స్థితిగతులు, డిమాండ్, వాతావరణ పరిస్థితులు మొదలైన అంశాలపై దాదాపు ఏడాది పాటు అధ్యయనం చేసి.. నివేదిక ఇచ్చిన తర్వాతే అడుగు పడింది. క్రూయిజ్ షిప్స్ తిరిగేందుకు బంగాళాఖాతం అనువైనదని కేంద్ర ప్రభుత్వం ధృవీకరించిన తర్వాతే.. టెర్మినల్ నిర్మాణ పనులకు చేపట్టారు. కానీ ఇప్పుడు ఎంపీ ఇలా మాట్లాడడంపై పోర్టు వర్గాలు ముక్కున వేలేసుకున్నాయి. రూ.100 కోట్లు పెట్టి ఇంటర్నేషనల్ టెర్మినల్ నిర్మించినప్పుడు ఇవన్నీ తెలుసుకోకుండానే జరుగుతుందా? అని అవాక్కయ్యారు.

ప్రారంభోత్సవం సరే.. సిబ్బంది ఏరీ?

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వంలో ప్రచార యావ తప్ప, ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న ధ్యాస కనిపించట్లేదు. ఇందుకు ఉదాహరణే ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఎక్సలెన్స్(అకడమిక్) భవనం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య, విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రధానంగా ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విలేజ్ క్లినిక్స్ నుంచి రాష్ట్ర స్థాయి ఆస్పత్రిల వరకు బలోపేతం చేశారు. అందులో భాగంగానే పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో నూతన విభాగాలను ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.28.60 కోట్లు వెచ్చించి అకడమిక్ విభాగాన్ని పూర్తి వసతులతో నిర్మించారు. ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ ఎట్టకేలకు మంగళవారం ప్రారంభోత్సవానికి సిద్ధం చేసింది. అయితే సిబ్బందిని మాత్రం ఇంకా కేటాయించలేదు. సిబ్బంది లేకుండానే రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీటిని ప్రారంభించనుండటం గమనార్హం. ప్రారంభోత్సవానికి ఏడాది కాలం తీసుకున్న కూటమి ప్రభుత్వం, సిబ్బంది నియామకానికి ఇంకెంత సమయం తీసుకుంటుందో చూడాలి.

సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవనం ప్రారంభం నేడు

మహారాణిపేట : ప్రభుత్వ మానసిక వైద్యశాలలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవనాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. అలాగే పెదవాల్తేర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జీవఎంఎస్‌ఆర్ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్టుమెంటు, ఆధునిక ఆపరేషన్ థియేటర్ ప్రారంభిస్తారు.


సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవనం

రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖ సిటీ : రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేయాలని సోలార్ వెండర్లు, బ్యాంకులు, అధికారులకు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సోమవారం విశాఖ సర్కిల్ కార్యాలయంలో వెండర్లు, బ్యాంకులు, ఈపీడీసీఎల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వార్డులు, గ్రామ పంచాయతీల్లో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమాలు సమన్వయంతో నిర్వహించాలన్నారు. నగరంలో 200 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్‌ను వినియోగిస్తున్నవారు 1.83 లక్షలకు పైగా ఉన్నప్పటికీ.. నగరంలో కేవలం 2,200 మాత్రమే రూఫ్ టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అపార్టమెంట్ల కామన్ సర్వీసులకు రూఫ్ టాప్ కచ్చితంగా ఏర్పాటు చేయించడంతో పాటు, వర్చువల్ నెట్ మీటరింగ్ పద్ధతిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. వినియోగదారులు తమ ఇంటి మిద్దెపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుని సున్నా విద్యుత్ బిల్లులను పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న వారికి రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు గరిష్ఠంగా రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని, బీసీలకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ఈ పథకానికి బ్యాంకులు ఏడు శాతం వడ్డీతో 90 శాతం రుణం ఇస్తున్నాయన్నారు. ఒక్కసారి పెట్టుబడితో 20 ఏళ్ల వరకు ఇంటికి సరిపడా విద్యుత్ వినియోగించడంతో పాటు, వాడుకోగా మిగిలిన అదనపు విద్యుత్‌ను విద్యుత్ సంస్థకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) టి.వి.సూర్యప్రకాష్, సీజీఎం బి.సులేఖరాణి, ఎస్ఈ జి.శ్యాంబాబు, ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ చిరంజీవి, ఈఈలు, సోలార్ వెండర్లు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

ఎమ్మెల్యే గంటాకు షాక్


ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వాహనాన్ని అడ్డుకున్న పాలవలస పంచాయితీ ప్రజలు


ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వాహనానికి అడ్డంగా కూర్చున్న మహిళలు

వాహనాన్ని అడ్డుకున్న పాలవలసవాసులు

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వాహనాన్ని సోమవారం ఆనందపురం మండలం పాలవలస పంచాయతీలో పార్టీలకు అతీతంగా ప్రజలు అడ్డుకున్నారు. ఆయన వాహనాన్ని ముందుకు కదలనీయబోమని మహిళలు వాహనానికి అడ్డంగా కూర్చుకున్నారు. వారిని శాంతింప చేయడానికి ఆనందపురం పోలీసులకు తల ప్రాణం తోకకు వచ్చినట్లయింది. వివరాల్లోకి వెళితే.. ఇదే పంచాయతీకి చెందిన మద్ది శివ అనే మహిళకు ల్యాండ్ పూలింగ్ ద్వారా రావలసిన వారసత్వ వాటా 1410 గజాలను ఇవ్వకుండా అత్త సీతయ్యమ్మ, బావ లక్ష్మీనాయుడు, అతని కుమారుడు శేఖర్, తోడికోడలు నాగమణి కాజేశారు. వాటా అడగడానికి వెళ్లిన ఆమెను, అల్లుడు పాలవలస రమేష్‌ను ఇటీవల శేఖర్‌తో పాటు రెడ్డి మహేష్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డారు. బాధితులు ఆనందపురం పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లినా న్యాయం జరగలేదు. టీడీపీలో తాను చెప్పిందే వేదమని ఏమైనా చేయగలనని శేఖర్ తరచూ తన పిన్ని అయిన శివను బెదిరించడంతో విసిగిపోయిన ఆమె, గ్రామస్తుల సాయంతో గంటా శ్రీనివాసరావును అడ్డుకున్నారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ అరగంటకు పైగా రోడ్డుపై బైఠాయించారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు న్యాయం చేస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.



ఆందోళనలతో దద్దరిల్లిన కలెక్టరేట్

మహారాణిపేట: విశాఖ కలెక్టరేట్ ధర్నాలు, నిరసనలతో దద్దరిల్లింది. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌సీ) సందర్భంగా సమస్యలపై వినతులు సమర్పించేందుకు వివిధ ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు భారీగా తరలివచ్చారు. పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నినాదాలు చేశారు.

మద్యం దుకాణం తొలగించాలి

కంచరపాలెం రామ్మూర్తి పంతుల పేటలోని జనావాసాల మధ్య ఉన్న 'మోనార్క్ వైన్స్'ను తొలగించాలని శ్రీ గౌరీ సేవా సంఘం విజ్ఞప్తి చేసింది. మద్యం దుకాణం వల్ల మందుబాబుల ఆగడాలు పెరిగాయని సంఘం అధ్యక్షుడు బొడ్డేటి చిన్న తెలిపారు.


నిరసన వ్యక్తం చేస్తున్న రామ్మూర్తి పంతులపేట ఏరియా వాసులు

బర్మా కాందిశీకుల భూముల పరిరక్షించాలి

కబ్జాదారుల నుంచి బర్మా కాందిశీకుల భూములను రక్షించాలని బర్మా కాందిశీకుల పునరావాస సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కప్పరాడలోని 9.5 ఎకరాల భూమిలో నిర్మించాల్సిన 188 గృహాలకు సంబంధించి భూములు కబ్జాకు గురవుతున్నాయని సంఘం అధ్యక్షుడు ఎం. నారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బర్మాకాందిశీకులు

టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి

ఆనందపురం దబ్బందలోని టిడ్కో ఇళ్లకు వీధిలైట్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహ్మాన్ కోరారు. బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ధర్నాలో యూనియన్ సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్, నాయకులు సత్యనారాయణ, కార్యదర్శి ఎం.మన్మధరావు, అధిక సంఖ్యలో టిడ్కో గృహవాసులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న టిడ్కో ఇళ్ల బాధితులు

హెచ్‌ఎం బదిలీకి డిమాండ్


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం యల్లపువానిపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంను తక్షణమే బదిలీ చేసి, విద్యార్థులకు చదువులు చెప్పేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. హెచ్‌ఎం పాఠాలు చెప్పకుండా ఇతర పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ పాఠశాలలో నాల్గో తరగతికి క్లాస్ టీచర్ లేరని, ఉన్న ఒక్క హెడ్‌మాస్టర్ చదువు చెప్పడం లేదని విద్యార్థులు వాపోయారు. పలుకుబడి కలిగిన హెచ్‌ఎం పాఠశాలలో చదువులు చెప్పకుండా రాజకీయాలు చేస్తున్నారని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.

గొడవ వద్దన్నందుకు.. స్నేహితుడి హత్య

- ఆదివారం అర్ధరాత్రి ఘటన
- చికిత్స పొందుతూ ఎల్లా మృతి
- టూటౌన్ పరిధిలో వరుస ఘటనలతో ఆందోళన


కేజీహెచ్‌లో ఎల్లాజీ మృతదేహం (ఇన్‌సెట్) ఎల్లాజీ (ఫైల్)

అల్లిపురం: 'గొడవలు ఎందుకు, సర్దుకుపోండి' అని చెప్పినందుకు స్నేహితుడని కూడా చూడకుండా కత్తితో పొడిచి హతమార్చిన ఘటన నగరంలో సంచలనం రేపింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రకాష్‌రావుపేటలో జరిగిన ఈ ఘటనతో నగరంలో శాంతిభద్రతలపై అనుమానాలు తలెత్తుతున్నాయి. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వారం రోజుల్లో రెండు ఘోర ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. మద్యం మత్తులో యువకులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వేంకటేశ్వర మెట్టకు చెందిన చెట్టి ఎల్లాజీ అలియాస్ వట్టి (22), అయ్యప్ప ఇద్దరు స్నేహితులు. ఆదివారం రాత్రి 12 గంటల వరకు వీరిద్దరూ కలిసి మద్యం సేవించారు. అనంతరం అయ్యప్ప కెప్టెన్ రామారావు జంక్షన్ వైపు వెళ్లగా, ఎల్లాజీ దాబాగార్డెన్స్ వైపు వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత అయ్యప్ప, ఎల్లాజీకి ఫోన్ చేసి తనకు కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ఒకరితో గొడవ జరుగుతోందని, రమ్మని పిలిచాడు. తక్షణమే అక్కడికి చేరుకున్న ఎల్లాజీ, వారిద్దరికి నచ్చజెప్పి పంపించాడు. తిరిగి ఎల్లాజీ దాబాగార్డెన్స్ వైపు వెళ్తుండగా, అయ్యప్ప మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెనుక నుంచి వచ్చాడు. ప్రకాష్‌రావుపేట రోడ్డులోని జాకీ షోరూం దగ్గరలో ఎల్లాజీ వీపుపై బలంగా కత్తితో పొడిచాడు. దీంతో ఎల్లాజీ బైక్ వదిలి, రక్తం కారుతూ సుమారు వంద మీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లాడు. తన స్నేహితుడు గణేష్‌కు ఫోన్ చేయడంతో అతను అక్కడికి చేరుకుని, మరొక స్నేహితుడు అమర్‌తో కలిసి గాయపడ్డ ఎల్లాజీని కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న నైట్ రౌండ్స్ త్రీటౌన్ సీఐ పల్లా పైడయ్య, టూటౌన్ ఎస్.ఐ సతీష్‌లు కేజీహెచ్‌కు చేరుకుని ఎల్లాజీ నుంచి వాంగ్మూలం తీసుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఎల్లాజీ మద్యం మత్తులో ఉండటంతో తనను చాకుతో పొడిచాడని మాత్రమే చెప్పగలిగాడు. డాక్టర్లు చికిత్స అందిస్తుండగానే ఎల్లాజీ మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపారు.

వారంలో రెండు ఘటనలు

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా రెండు ఘోర ఘటనలు చోటు చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నియోజకవర్గంలో మద్యం దుకాణాల వద్ద విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతుండటంతో యువత పూటుగా మద్యం సేవిస్తున్నారు. ఆ మత్తులో గొడవలు పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. బంగారు భవిష్యత్తు కలిగిన యువత మద్యం మత్తులో తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. నగరంలో శాంతిభద్రతల పరిస్థితిపై తక్షణమే దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్జీలు అందిన రోజే పరిశీలించాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- పీజీఆర్‌ఎస్‌కు 154 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 154 వినతులు వచ్చినట్లు మేయర్ తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగానికి అత్యధికంగా 77 ఫిర్యాదులు అందాయి. ఇంజనీరింగ్ విభాగానికి 35, ప్రజారోగ్యానికి 7, రెవెన్యూకి 12, జీవీఎంసీ పరిపాలన, అకౌంట్స్ విభాగానికి 15, మొక్కల విభాగానికి 5, యూసీడీకి 3, ప్రధాన కార్యాలయానికి 42 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

జోనల్ కమిషనర్లతో కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్

ప్రజా సమస్యల పరిష్కార వేదికపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో జరుగుతున్న కార్యక్రమానికి సంబంధించి కమిషనర్ కేతన్‌గార్గ్ జోనల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ప్రజలు అందజేసిన ఆర్జీలు, ఫిర్యాదులను అదే రోజు పరిశీలించి, సంబంధిత ఫిర్యాదిదారులతో సంప్రదించి, నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. అందిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీర్ పల్లంరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ, డీసీఆర్ శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్లు పీవీవీ సత్యనారాయణరాజు, కేవీఎన్ రవి, కె.శ్రీనివాసరావు, గోవిందరావు, సంపత్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు

కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు 348 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

మహారాణిపేట: ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు అందిన ప్రతి వినతిపత్రంపై సంబంధిత అధికారి లేదా ఉద్యోగి తప్పకుండా ఫిర్యాదుదారుతో ఫోన్‌లో సంప్రదించి, సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి బుధవారం, గురువారం తాను స్వయంగా ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి మాట్లాడుతానని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన వినతులను వెంటనే లాగిన్‌లో ఓపెన్ చేసి, కాలపరిమితిలోగా పరిష్కరించాలని సూచించారు. సోమవారం పీజీఆర్‌ఎస్‌కు వివిధ సమస్యలపై 348 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 122, జీవీఎంసీకి 76, పోలీస్ శాఖకు 14, ఇతర శాఖలకు 136 ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీ శంకర్, సీసీపీ ధనుంజయరావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీసీ ఇవ్వకుండా ఇబ్బందులు



బోయపాలెం శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో నా కుమార్తె డి.కృపారాణి ఇంటర్ రెండేళ్లకు పూర్తి ఫీజు చెల్లించాం. చదువు పూర్తయినా టీసీ ఇవ్వడానికి యాజమాన్యం ఎన్నో అడ్డంకులు సృష్టిస్తోంది. నా కుమార్తె ఉన్నత చదువుకు అడ్డంకి కలుగుతుంది. తక్షణం టీసీ ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

– డి.గౌరీశంకర్, బోయపాలెం

ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

మద్దిలపాలెం: అన్ని ప్రభుత్వ శాఖలు, యూనివర్సిటీలతోపాటు, ప్రైవేట్ సంస్థల్లో నియామక ప్రక్రియలో ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. ఏయూ ఎస్టీ ఉద్యోగ సంఘ సభ్యులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఏయూలో ఎస్టీ రిజర్వేషన్ అమలు, ఉద్యోగుల రోస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాల్లో ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల్లోనూ తప్పనిసరన్నారు. అనంతరం ఆయన ఎస్టీ విద్యార్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. వారి సమస్యలు, సౌకర్యాలపై ఆరా తీశారు. పెరిగిన టెక్నాలజీని ఆయుధంగా ఉపయోగించుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు.

జీసీసీ పటిష్టతకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం

మహారాణిపేట: గిరిజన ప్రాంతాల్లో వారు పండించిన ఉత్పత్తుల నిల్వకు కోల్డ్ స్టోరేజీలు, గొడౌన్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్లు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక జీసీసీ కార్యాలయంలో సోమవారం సమీక్ష జరిపారు. తొలుత గిరిజన సంక్షేమం కోసం జీసీసీ చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జీఎం(అడ్మిన్) జి.సంధ్యారాణి వివరించారు. అనంతరం చైర్మన్ జీసీసీ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ చర్యలపై ఆరా తీశారు. సీనియర్ మేనేజర్(కాఫీ) టి.శ్రీనివాసరావు, విజిలెన్స్ ఆఫీసర్ ఎంవీవీఎస్ ఉమాదేవి, ఫైనాన్స్ జీఎం నిర్మలమ్మ, మార్కెటింగ్ జీఎం త్రినాథరావు, డీజీఎం(డీఆర్‌ఎస్) సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి


మృతుడు కిషోర్ కుమార్ (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గంభీరం పంచాయతీలోని దుక్కవానిపాలెం గ్రామానికి చెందిన సత్యాల వెంకట కిషోర్ కుమార్ (24) దుర్మరణం చెందాడు. జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం, మారికవలసలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న కిషోర్ కుమార్, ప్రతిరోజూ తన గ్రామం నుంచి కుటుంబ సభ్యులు, ఇతరులను కూరగాయల మార్కెట్‌లో దించి, ఆటో సర్వీస్ చేస్తూ విధులకు వెళ్తుంటాడు. ఉదయం 4:10 గంటల సమయంలో వేములవలస వద్ద ఆగి ఉన్న ఒక వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో కిషోర్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడ్ని ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో మృతదేహాన్ని భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కిషోర్ కుమార్‌కు రెండేళ్ల పావనితో వివాహం జరిగింది. అతని మృతితో దుక్కవానిపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

కలెక్టరేట్ వద్ద ఆంక్షలతో మహిళల ఇబ్బందులు


పీజీఆర్‌ఎస్‌లో వినతులు ఇవ్వడానికి వెళుతున్న మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్‌కు వినతులు సమర్పించేందుకు వచ్చే సందర్శకులపై పోలీసుల అతి ప్రవర్తన విమర్శలకు తావిస్తోంది. పీజీఆర్‌ఎస్ జరిగే సమయంలో వివిధ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజాసంఘాలు, వామపక్షపార్టీలు నిరసన తెలపడానికి వస్తుండడంతో కలెక్టరేట్ రెండు ప్రధాన ద్వారాలకు బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. లోపలికి ఎవరినీ అనుమతించకుండా, ఎవరైనా వెళ్లాల్సి వస్తే అనేక ప్రశ్నలు వేసి, సంతృప్తికరమైన సమాధానం చెబితేనే అనుమతిస్తున్నారు. లేకపోతే వెనక్కి పంపించే పరిస్థితి ఉంది. ఇది ముఖ్యంగా మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలను పోలీసులు ఇలా ప్రశ్నించి అనుమతులు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

గంజాయి కేసుల్లో నిందితులకు రిమాండ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసుల్లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ రైల్వే పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు, ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారమ్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో, బీహార్‌లోని సితమర్హి జిల్లాకు చెందిన హర్షిత్ మిశ్రా అనే వ్యక్తి కోరాపుట్ నుంచి ఢిల్లీకి విశాఖ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా గుర్తించారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని, రూ. 59,000 విలువైన 11.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హర్షిత్ మిశ్రాను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. మరో కేసులో జీఆర్‌పీ ఎస్ఐ అబ్దుల్ మరూఫ్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎంఎల్ మీనా తమ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారమ్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఉత్తరప్రదేశ్‌లోని ఖేరీ జిల్లాకు చెందిన అన్మోల్ మిశ్రా అనే వ్యక్తి కోరాపుట్ నుంచి లక్నో, ఉత్తరప్రదేశ్‌కు విశాఖ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా గుర్తించారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని..రూ. 48,000 విలువైన 9.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అన్మోల్ మిశ్రాను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

కేజీహెచ్‌లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఇటీవల ఓ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. నెఫ్రాలజీ, యూరాలజీ, అనస్థీషియా విభాగాల వైద్యులు సమన్వయంతో ఈ శస్త్రచికిత్సను పూర్తి చేయగా, సోమవారం రోగిని డిశ్చార్జ్ చేసినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి తెలిపారు.

దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలతో 39 ఏళ్ల పి. లక్ష్మి బాధపడుతూ కేజీహెచ్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆమె తల్లి ఎం. లక్ష్మి తమ కుమార్తెకు కిడ్నీ దానం చేయడానికి ముందుకొచ్చారు. అన్ని పరీక్షలు నిర్వహించిన తర్వాత జూలై 2వ తేదీన లాప్రోస్కోపిక్ పద్ధతిలో ఆధునిక శస్త్రచికిత్సను నిర్వహించారు. ఆపరేషన్ విజయవంతంపై సూపరింటెండెంట్ డాక్టర్ వాణి వైద్య బృందాన్ని అభినందించారు. నెఫ్రాలజీ విభాగం ఇన్‌చార్జి డి.రాధాకృష్ణన్, వైద్యులు రత్నప్రభ, సింధూర్, నాగబాబు, నిషాకుమారి, జయశ్రీలక్ష్మి, దివ్య, సంతోష్, యురాలజీ విభాగాధిపతి డాక్టర్ ఐ.చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దిలీప్, డాక్టర్ ఫాతిమా, డాక్టర్ వెంకటకృష్ణ, ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ రవి, ప్రొఫెసర్ కె.శ్రీలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సూర్య ప్రకాష్ తదితరులను సూపరింటెండెంట్ అభినందించారు.

పీ–4 మార్గదర్శుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ–4 కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శుల గుర్తింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 10 వేల మందిని గుర్తించాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన నిర్దేశించారు. ఔత్సాహికులను గుర్తించి జాబితాలను రూపొందించాలని, వాటిని బంగారు కుటుంబాలకు అనుసంధానించాలని కలెక్టర్ సూచించారు. పేదరికం లేని సమాజ నిర్మాణంలో అధికారులు భాగస్వామ్యం కావాలని, దానిలో భాగంగా గెజిటెడ్ ర్యాంకు కలిగిన అధికారి కనీసం ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని పేర్కొన్నారు. పీ–4లో భాగంగా దత్తత తీసుకునేవారు ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, ఏ రూపంలోనైనా సాయం అందించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా రంగాల్లో నిష్ణాతులు దత్తత తీసుకుంటే సంబంధిత రంగానికి చెందిన పరిజ్ఞానం అందించవచ్చని, శిక్షణకు దోహదపడొచ్చని తెలిపారు. పీ–4లో చేరినా, తోడ్పాటు అందించినా సంక్షేమ పథకాలపై ఎలాంటి ప్రభావం పడదని ఈ విషయాన్ని అందరూ గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, సీపీవో శ్రీనివాసరావు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పార్కుల వివరాలు తెలపండి

నగర మేయర్ పీలా శ్రీనివాసరావు


పట్టణ ప్రణాళికా విభాగాధిపతులతో సమావేశమైన నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

అల్లిపురం: జీవీఎంసీ పార్కుల వివరాలు తెలియజేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా జోన్లలో ఎన్ని పార్కులు, ఖాళీ స్థలాలు ఉన్నాయో వివరాలు ఇవ్వాలని కోరారు. ఎన్ని పార్కులు ఆక్రమణకు గురయ్యాయో, ఎన్ని పార్కులు కోర్టు కేసుల్లో ఉన్నాయో పూర్తి వివరాలు మూడు రోజుల్లో అందించాలన్నారు. అన్యాక్రాంతంలో ఉన్న పార్కులు, ఖాళీ స్థలాల వివరాలు తనకు తెలుసునని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక అందించాలని పట్టణ ప్రణాళికా విభాగాధిపతులను కోరారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, డీసీఆర్ ఎస్ శ్రీనివాసరావు, సిటీ ప్లానరు మీనాకుమారి, ధనుంజయరెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, రామ్మోహన్, జీవీఎంసీ రెవెన్యూ ఆఫీసర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, ARJALA BOSALU previously called ARJALLA BASOLU S/O RAMLOO ARJALLA, Resident of D.No. 71-31-1661, Kakaralova Malkapuram, Visakhapatnam - 530 011. Now changed my name from ARJALLA BASOLU (Old name) to ARJALA BOSALU (New name) henceforth I will be called as ARJALA BOSALU for all purposes

CHANGE OF NAME
I, ARJALA LAXMI previously called KORLAMMA ARJALLA W/o ARJALA BOSALU, Resident of D.No. 71-31-1661, Kakaralova Malkapuram, Visakhapatnam - 530011. Now changed my name from KORLAMMA ARJALLA (Old name) to ARJALA LAXMI (New name) henceforth I will be called as ARJALA LAXMI for all purposes

PASSPORT LOST
I, MIDATHANA PRAKASH, S/o Midathana Nookaraju (Late), Residing at D.No. 7-13-47, Ramalayam Street, Old Gajuwaka, Visakhapatnam - 530026, (A.P). Lost my Passport bearing No. (X4483952). While I was Travelling from Gajuwaka to Srinagar by bike. If anyone found my Passport. Please Contact : 70139 49165

Wanted

■ Wanted Mathematics Faculty (Part Time) for CA Foundation Course, Qualification: M.Sc Maths Eapet/ IIT Teaching. Experience is Desirable. Salary Negotiable, Working Location: Master Minds College: Vizag. Contact: 92487 33325 / 92487 33303 [G-6100]

Real Estate

FLAT FOR SALE
■ అక్కయ్యపాలెం చెక్కుడు రాయ బిల్డింగ్ దగ్గర్లో కొత్త 2BHK ఫ్లాట్ 52 లక్షలకే అమ్మకం. ఫోన్ : 98663 21992 [V- 14103]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ / MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
రాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్


జీవీఎంసీ విభాగాధిపతులతో సమీక్ష నిర్వహిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

అల్లిపురం: ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి సుపరిపాలనకు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విభాగాధిపతులను ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ శాఖలు రహదారుల విస్తరణ, టీడీఆర్ జారీ వంటి అంశాల్లో ఉమ్మడి క్షేత్ర పరిశీలన చేసి వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో గెడ్డల పూడికతీత, వస్తు సామగ్రి కొనుగోలు వంటి వాటిలో సత్వర ఫలితాలు రాబట్టాలని సూచించారు. మంగళవారం నుంచి శాఖల వారీగా సమీక్షలు, ప్రతి శనివారం సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలిస్తానని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రధాన వైద్యాధికారి ఈఎన్‌వీ నరేష్‌కుమార్, ప్రధాన ఇంజనీర్ పల్లపు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ఐతో మరింత భద్రత

తాటిచెట్లపాలెం: తూర్పు కోస్తా రైల్వేలోని వాల్తేరు డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్లలో లోకోమోటివ్ (ఇంజిన్)ల నిర్వహణలో ప్రయాణికుల భద్రతను పెంపొందించడానికి అత్యాధునిక మెజరింగ్, రికార్డింగ్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ పరికరాలను(ఎంఆర్ఐ) ప్రవేశపెడుతున్నారు. భారతీయ రైల్వేలో ఇప్పటికే వీటి వినియోగం ప్రారంభమైంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఎంఆర్ఐ పరికరాలను లోకోమోటివ్ పైభాగంలో అమర్చడం ద్వారా విద్యుత్ లైన్, లోకోల మధ్య ఖాళీ (క్లియరెన్స్) , కచ్చితమైన స్థానం తెలుస్తుంది. దీని వల్ల ప్రమాదాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని, రైళ్ల రాకపోకలలో కచ్చితత్వం మెరుగుపడుతుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం నడుస్తున్న విద్యుత్ లోకోల వల్ల ఎదురయ్యే ప్రమాదాలను, లోపాలను అన్నివేళలా సరిగ్గా అంచనా వేయలేమని, అయితే ఈ కొత్త ఏర్పాటుతో వాటన్నింటినీ ఖచ్చితంగా తెలుసుకుని నివారించవచ్చని అధికారులు తెలిపారు. ఎంఆర్ఐ పరికరాల వినియోగం వల్ల బ్రేక్‌డౌన్‌లు, రైళ్ల ఆలస్యాలను నివారించవచ్చని రైల్వే అధికారులు వివరించారు.

రెప్పపాటులో ప్రమాదం



ఏయూ క్యాంపస్: ప్రమాదం ఎటువైపు నుంచి, ఎలా ముంచుకొస్తుందో ఎవరికీ తెలియదు. రెప్పపాటులో జీవితాన్ని తల్లకిందులు చేస్తుంది. ఇలాంటి దృశ్యమే సోమవారం బీచ్‌రోడ్డులో సాక్షి కెమెరాకు చిక్కింది. ఆల్ ఎబిలిటీ



పార్క్ వెనుక సముద్ర తీరంలో సరదాగా ఫోటో దిగుదామని వెళ్లిన వారిపై అకస్మాత్తుగా భారీ కెరటం విరుచుకుపడింది. చుట్టూ ఉన్నవారు కాసేపు ఆందోళన చెందారు. అయితే ఆ కెరటానికి చిక్కుకున్నవారికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడ ఉన్న రాళ్ల వద్ద ఫోటోలు దిగేందుకు అంతా ఆసక్తి చూపుతారు. కెరటాలు ఉధృతంగా వచ్చే సమయంలో రాళ్ల వద్దకు వెళ్లడం ప్రమాదాలను కొనితెచ్చుకోవడమే. పొరపాటున జారిపడితే గాయాల పాలయ్యే అవకాశాలు ఎక్కువ. వాటికి దూరంగా ఉండటమే మేలు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం